సరస్వతీ పుష్కరాల పనుల్లో నాణ్యత పాటించాలి

• కలెక్టర్ రాహుల్‌శర్మ • కాళేశ్వరంలో పుష్కరాల పనుల పరిశీలన

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్(కాళేశ్వరం), ఏప్రిల్ 19 : మండలంలోని కాళేశ్వరంలో మే 15 నుంచి 26వరకు నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం కాళేశ్వరంలో జరుగుతున్న పుష్కరాల పనులను కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా వీఐపీ ఘాట్ వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను, ర్యాంపు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు, సరస్వతీ విగ్రహ ఏర్పాట్ల పనులను పరిశీలించారు. అనంతరం ప్రధాన ఘాట్ వద్ద జరుగుతున్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంతో డీపీవో నారాయణరావు, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్‌శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ ఈవో మహేశ్, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యభట్ట శాటిలైట్ స్వర్ణోత్సవ వేడుకలు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 19 : భారతదేశపు తొలి శాటిలైట్ ఆర్యభట్టను ఉపయోగించి ఏప్రిల్ 19 నాటికి 50ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో శాటిలైట్ ఆర్యభట్ట స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల కరస్పాండెంట్ కే మారుతి హాజరై మాట్లాడారు. నేటి అంతరిక్ష పరిశోధనలో ప్రపంచంతో భారతదేశం 5వ స్థానం నుంచి 1వ స్థానానికి వెళ్లడానికి భావిభారత పౌరులు ఇస్రోలో ప్రవేశం పొంది భారతదేశంలో అన్ని రంగాల్లో ఉన్నత స్థానంలో నిలుపాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం ఝాన్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

ములుగురూరల్, ఏప్రిల్ 19 : పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలని 1962 సంచార పశు వైద్య వాహన వైద్యురాలు డాక్టర్ అనూష, పారవేట్ ధనుంజయ్, కెప్టెన్ రవితేజ, హెల్పర్ శ్యామ్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ పాడి సంపద పరిరక్షణ కోసం ప్రవేశపెట్టిన 1962 వాహనాల్లో విధులు నిర్వర్తిస్తున్న తమకు మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం 2017లో పశువులకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 100 వాహనాలు ఏర్పాటు చేసిందని, ఈ 1962 వాహనం ద్వారా పశువులకు సకాలంలో వైద్య సేవలు అందడంతో పాటు గ్రామాల్లోని పశు మరణాలు తగ్గాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సిబ్బందికి సకాలంలో వేతనాలు అందడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్లాట్ కొనిస్తానని మోసం చేసిన ఒకరి అరెస్ట్

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 19 : ప్లాట్ కొనిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని 1000 క్వార్టర్స్‌లో నివాసం ఉండే ఎల్ కమల మిత్ర నుంచి ప్లాట్ కొనిస్తానని కరీంనగర్‌కు చెందిన మహ్మ ద్ సనావుల్లా ఖాన్ రూ.3లక్షలు తీసుకొని రెండేళ్లుగా చుట్టూ తిప్పించుకుంటున్నాడు. ఇప్పటి వర కూ ఎలాంటి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయించక పోవడంతో కమల మిత్ర ఫిర్యాదు మేరకు మహ్మద్ సనావుల్లా ఖాన్‌ను శనివారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మహాముత్తారం : మాట్లాడుతున్న పుట్ట మధు

గోవిందరావుపేట : సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

మహాముత్తారం, ఏప్రిల్ 19 : హనుమకొండలోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు పిలుపునిచ్చారు. శనివారం మహాముత్తారం మండలంలో పర్యటించారు. కేసీఆర్ మహాసభను ప్రతి కార్యకర్త ఇంట్లో పండుగ వాతావరణంలో జరుపుకునేలా భారీ ఎత్తున తరలిరావాలన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి పార్టీని స్థాపించి, అనేక పోరాటాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణ జాతిపిత, ఉద్యమ సారథి కేసీఆర్ తెలంగాణ మొదటి సీఎంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దేశంలోనే నంబర్ వన్‌గా మార్చారన్నారు. ఇప్పుడున్న జనరేషన్‌కి కొత్త ఆలోచన కలిగించే వేదికగా ఈ బహిరంగ సభ ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టి 24 ఏళ్లు పూర్తి చేసుకొని 25వ సంవత్సరంలో విజయవంతంగా అడుగు పెడుతున్న సందర్భంగా అధినేత కేసీఆర్ పిలుపు మేరకు రజతోత్సవ సభకు విజయవంతం చేయాలన్నారు. ఆ రోజు గ్రామ గ్రామాన గులాబీ జెండాలు రెపరెపలాడాలన్నారు. మంథని నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు గులాబీ జెండాను ఆవిష్కరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అంశాల్లో విఫలమవుతోందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. ఎప్పటికైనా తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెల్మరెడ్డి అనిల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మండల రాజిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు మార్క రాము గౌడ్, మాజీ ఎంపీపీ మెండ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ సురేశ్, జగపతి నాయక్ పాల్గొన్నారు.

దండుగా కదిలిరావాలి

గోవిందరావుపేట : హనుమకొండలో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతి పల్లె నుంచి ప్రజలు దండుగా కదిలిరావాలని రైతు బంధు సమన్వయ సమితి మండల మాజీ కోఆర్డినేటర్ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శనివారం పార్టీ మండల అధ్యక్షుడు లాకవత్ నర్సింహానాయక్ అధ్యక్షతన సమవేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మధుసూదన్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తుమ్మల హరిబాబు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మళ్లీ రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌ను కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్‌రావు, స్వరూప, మాజీ ఉప సర్పంచ్‌లు అల్లంనేని హనుమంతరావు, మండల అధికార ప్రతినిధి భూరెడ్డి మధు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

కాటారం/మల్హార్/మహాముత్తారం, ఏప్రిల్ 19 : కాటారం మండలకేంద్రానికి చెందిన కొట్టె రాంబాయి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చి, ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే, ప్రతాపగిరి గ్రామంలో దండవేన శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కూడా పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు జక్కు శ్రావణ్, చీమల వంశీ, పంతకాని సడువలి, ఊర వెంకటేశ్వర్‌రావు, మందల లక్ష్మారెడ్డి, కొండగొర్ల వెంకటస్వామి, సడువలి, రాజేంద్రచారి, సంతోష్, అశోక్, రవి ఉన్నారు. మల్హార్ మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ విజయ్‌కుమార్ మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను పుట్ట మధు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, నాయకులు జే రాకేశ్, తాజోద్దిన్, సదానందం, సమ్మయ్య ఉన్నారు. అలాగే, మహాముత్తారం మండలం ప్రేమ్‌నగర్‌లో ముక్లోత్ రాధాబాయి, సింగారంలో బొబ్బిలి సురేశ్ గౌడ్, ములుగుపల్లిలో మాజీ సర్పంచ్ దూలం మల్లయ్య తల్లి దూలం మల్లక్క మృతిచెందగా బాధిత కుటుంబాలను పుట్ట మధు పరామర్శించారు.

నేటి నుంచి ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 19 : జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి జరుగనున్న ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో ఎం రాజేందర్ శనివారం తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు 411 మంది, పదో తరగతి విద్యార్థులు 291 మంది హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాత పరీక్షల అనంతరం ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 26నుంచి మే 3వరకు ప్రాక్టికల్స్ ఉంటాయని తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూడాలని ఆయన సూచించారు.

నిద్రిస్తున్న లారీ డ్రైవర్‌పై నుంచి వెళ్లిన గుర్తుతెలియని వాహనం

దవాఖానకు తరలిస్తుండగా మృతి

మంగపేట ఏప్రిల్ 19 : మండలంలోని చుంచుపల్లి ప్రధాన రహదారి పక్కన పడుకున్న ఓ లారీ డ్రైవర్‌పై నుంచి గుర్తు తెలియని వాహనం వెళ్లడంతో అతడు మృతి చెందాడు. స్థానిక ఎస్సై సూరి కథనం ప్రకారం.. ఆంధ్ర ప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా దిడుగు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కుంభ గోపి(25) వాడగూడెం ఇసుక క్వారీ వద్దకు ఇసుక కోసం శుక్రవారం వచ్చాడు. రాత్రి కావడంతో లారీని చుంచుపల్లి ఆశ్రమ పాఠశాల సమీపంలో పార్కింగ్ చేసి, రోడ్డు పక్కనే నిద్రించాడు. అయితే, అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం అతడిపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన సహచరులు ములుగు ఏరియా దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి మేనమామ కొజ్జ బుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వర్ణభారతి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా సరిత

గణపురం, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలోని స్వర్ణ భారతి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా చెల్పూర్ గ్రామానికి చెందిన ముదురుకోళ్ల సరిత ఎన్నికయ్యారు. శనివారం సమాఖ్య కార్యాలయంలో ఐబీడీపీఎం సోమయ్య, ఏపీఎం ఇమామ్ ఆధ్వర్యంలో జరిగిన వీవోఏల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ముదురుకోళ్ల సరిత, కార్యదర్శిగా సీతారాంపూర్ గ్రామానికి చెందిన గుండు సుగుణ, కోశాధికారిగా మండల కేంద్రానికి చెందిన గడ్డమీది సునందలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీసీలు బాబా, శకుంతల మహిళా సంఘాల వీవోఏ అధ్యక్షులు పాల్గొన్నారు.

మహిళ తో అసభ్యంగా ప్రవర్తించిన ఒకరిపై కేసు

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 19 : పాత కక్షలు మనుసులో పెట్టుకొని ఓ మహిళ ఇంటికి వెళ్లి అసభ్యకరమైన రీతిలో ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని ఇస్సిపేటకు చెందిన యార అనంత్ గత సంవత్సరం ఓ యువతితో అసభ్యకరంగా ప్రవర్తించగా అతడిపై కేసు నమోదు చేశారు. విషయాన్ని మనసులో పెట్టుకొన్న అనంత్ శుక్రవారం రాత్రి సదరు యువతి ఇంటికి వెళ్లి బలవంతంగా తలుపులు తీసి, ఇంట్లోకి వెళ్లి యువతి, ఆమె తల్లిపై అసభ్యకరమైన రీతిలో ప్రవర్తిస్తుండగా ఇద్దరూ అరుస్తూ బయటికి వెళ్లారు. దీంతో చుట్టుపక్కల వాళ్లు రావడంతో అతడు పారిపోయాడు. బాధిత మహిళ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, 24గంటల్లో అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ సభ వాల్‌రైటింగ్ తుడిచివేత

పెయింటర్‌పై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

పెయింటర్‌ను మందలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

రేగొండ, ఏప్రిల్ 19 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ రైటింగ్‌ను చెరిపివేస్తూ వాటి స్థానంలో భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తన పేరు రాయించుకున్న ఘటన రేగొండ చెక్‌పోస్టు వద్ద జరిగింది. దీంతో ఎమ్మెల్యే పేరు రాస్తున్న పెయింటర్‌పై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేగొండ మండలకేంద్రంలోని చెక్‌పోస్టు సమీపంలోని ప్రధాన రహదారిలో కల్వర్టు మోరీపై ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభవాల్ రైటింగ్‌ను మాజీ ఎమ్మెల్యే రాయించారు. అయితే, కక్ష పూరితంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే వాటిని పూర్తిగా తొలిగించి, వాటి స్థానంలో తన పేరు రాయించుకుంటున్నారు. శనివారం భూపాలపల్లికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఈ దృశ్యాన్ని చూసి, వెంటనే తన వాహనాన్ని ఆపారు. పెయింటర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు పెయింటింగ్‌లు మారుస్తున్నారని, తిరిగి బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌రైటింగ్ చేయాలని హెచ్చరించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి

చిట్యాల : మాట్లాడుతున్న డీడబ్ల్యూవో మల్లీశ్వరి

చిట్యాల/భూపాలపల్లి రూరల్/మల్హార్, ఏప్రిల్ 19 : ప్రతి ఒక్కరూ పోషణతో కూడిన ఆహారం తీసుకోవాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి అన్నారు. శనివా రం చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద అధ్యక్షతన మండల స్థాయిలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంత రం చిన్నారులకు అన్నప్రసాన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతాలు పౌష్టికాహారంపై ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హే మ, ఎంపీడీవో జయప్రద, ఒడితల వైద్యురా లు మౌనిక, ఎంఈవో రఘుపతి, ఏపీఎం మంజుల, 60మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. అలాగే, భూపాలపల్లి మండలంలోని గొర్లవేడు గ్రామం గోపువారిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో కూడా పోషణ్ పక్వాడా వేడుకలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సునీత పౌ ష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ శారద, హెల్పర్ సునీత, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

అలాగే, మల్హార్ మండలంలోని తాడిచర్ల గ్రామంలో జడ్పీ పాఠశాలలో మండల స్థాయి పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. మహదేవపూర్ సీడీపీవో రాధిక పాల్గొని అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వైద్యాధికారి వినయ్‌బాస్కర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయగూడేల్లో అటవీశాఖ దాడులు

భారీగా వేట సామగ్రి స్వాధీనం

వివరాలను వెల్లడిస్తున్న ఎఫ్ఆర్‌వో అబ్దుల్ రెహమాన్

ఏటూరునాగారం, ఏప్రిల్ 19 : అటవీశాఖ రేంజ్ పరిధిలోని తొమ్మిది గొత్తికోయగూడేల్లోని వేటగాళ్ల ఇండ్లల్లో దాడులు నిర్వహించి భారీగా వేటకు ఉపయోగించే పరికరాలు బాణాలు, కరెంటు వైర్లు, తీగలు, ఉచ్చులకు ఉపయోగించే క్లచ్ వైర్లు, ఇతర సామగ్రిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దక్షిణ రేంజ్ విభాగం రేంజ్ ఆఫీసర్ అబ్దుర్ రెహమాన్ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చింతలపాడు, రాయబంధం, లింగాపూర్, షాపల్లి, కొమురంభీం నగర్, ఐలాపూర్, కొండాయి, మల్యాల, రేగులగూడెం గొత్తికోయ గ్రామాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో బాణాలు, ఉచ్చులు, కరెంటు వైర్లు, విద్యుత్ తీగలు, జే వైర్లు, బల్లాలు తదితర వస్తువులను పెద్దఎత్తున స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరి వద్దనైనా వేటకు ఉపయోగించే సామగ్రి, పరికరాలు ఉంటే తమకు అందజేయాలన్నారు. సమావేశం లో డీఆర్‌వో ప్రహ్లాద్, ఎఫ్ఎస్‌వో నారాయణ, బీటు ఆఫీసర్లు దయానంద్, రాజేశ్, జ్యోతి, అనూష, సుమలత, అశ్విని పాల్గొన్నారు.

రేపటి ప్లీనరీకి ఉద్యమకారులు హాజరు కావాలి

ములుగురూరల్/కాటారం, ఏప్రిల్ 19 : తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఈ నెల 21న హైదరాబాద్‌లో నిర్వహించే ప్లీనరీకి ములుగు జిల్లాకు చెందిన ఉద్యమకారులు హాజరుకావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య కోరారు. ఈ మేరకు శనివారం ములుగులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లీనరీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు నరేశ్, భద్రయ్య, నర్సింహులు, దేవేందర్, సాంబయ్య, సంధ్య, పూలమ్మ, కమలమ్మ, సరోజన, ఉపేంద్ర, సమ్మక్క, మల్లమ్మ పాల్గొన్నారు. అలాగే, కాటారం మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య, మండల జేఏసీ చైర్మన్ బొమ్మ సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల జేఏసీ కోకన్వీనర్ జనగామ కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లపై టోల్‌ఫ్రీ నంబర్

ములుగురూరల్, ఏప్రిల్ 19 : యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను అధికారులకు ఫిర్యాదు చేసేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తీసుకువచ్చామని కలెక్టర్ టీఎస్ దివాకర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పని దినాలలో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు రైతులు తమ ఫిర్యాదులను 9347416178కు చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా రేషన్‌కార్డులను అర్హులకు ఇచ్చేందుకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

పారాలీగల్ వలంటీర్లకు శిక్షణ

ములుగురూరల్, ఏప్రిల్ 19 : ములుగు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ములుగు కోర్టులో పారాలీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. జడ్జి కన్నయ్యలాల్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థకు, ప్రజలకు వలంటీర్లు అనుసంధాన కర్తలుగా పనిచేస్తూ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అదనపు జడ్జి జే సౌఖ్య, బార్ అసోసియేషన్ కార్యదర్శి భిక్షపతి, న్యాయవాదులు మహేందర్, స్వామిదాస్, సునిల్ ఉన్నారు.

కొత్త చట్టంపై రైతులకు అవగాహన

ములుగులో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, ఏప్రిల్19 : ములుగు జిల్లా కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం భూ భారతి పోర్టల్ విధానంపై తహసీల్దార్ విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ టీఎస్ దివాకర హాజరై భూ భారతి చట్టంలో కొత్తగా తీసుకువచ్చిన 14 అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే, గోవిందరావుపేటలోని రైతు వేదికలో కూడా కలెక్టర్ టీఎస్ దివాకర భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాదిలోపు పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో దేవరాజు, తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీడీవోలు రామకృష్ణ, జవహర్‌రెడ్డి, ఏవో జితేందర్‌రెడ్డి, ఆర్ఐ యుగేంధ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. కాగా, ధాన్యం కొనుగోళ్లపై హైదరాబాద్ నుంచి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ములుగు కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ దివాకర, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

కాటారంలో..

కాటారం : భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. కాటారం మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం భూ భారతి చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సందేహాలున్నా తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్, మాజీ ఎంపీపీ పీ సమ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో షైన్ ప్రభంజనం

జీ వికాస్ సీహెచ్ శ్రీతన్ పీ శ్రీమహేశ్

హనుమకొండ, ఏప్రిల్ 19 : జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో 98.67 పర్సంటేజీ సాధించడంతో పాటు కార్పొరేట్ విద్యాసంస్థలకు సమానంగా ఫలితాలు వచ్చాయని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు మూగుల రమ, పీ రాజేంద్రకుమార్, మూగుల రమేశ్ సంయుక్తంగా తెలిపారు. మంగళవారం విడుదల చేసిన జేఈఈ ఫలితాల్లో షైన్ జూనియర్ కళాశాల జాతీయ స్థాయి ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులను సైతం ఆణిముత్యాలుగా తయారు చేశామని తెలిపారు. జాతీయ స్థాయిలో పర్సేంటేజీ సాధించిన పీ శ్రీమహేష్ (98.67పర్సంటేజీ), జీ వికాస్ (98.59), సీహెచ్ శ్రీతన్ (96.04)ను అభినందించారు. వీరితో పాటు 29 మంది విద్యార్థులు 90శాతం పర్సంటేజీకి పైగా ఫలితాలు సాధించారని చైర్మన్ తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ప్రతి విద్యార్థిపై వ్యక్తిగతమైన శ్రద్ధ తీసుకోవడంతో ఈ విజయాలు సాధించారన్నారు. కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల డైరెక్టర్ ఐఐటి కో ఆర్డినేటర్ రమేశ్ యాదవ్, కళాశాలల ప్రిన్సిపాళ్లు మారబోయిన రాజు గౌడ్, శ్రీనివాసన్, సంధ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

విజయకేతనం చూపిస్తున్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

జేఈఈ ఫలితాల్లో రెజోనెన్స్ విజయకేతనం

హనుమకొండ, ఏప్రిల్ 19 : జాతీయ స్థాయి పోటీ పరీక్ష జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రెజోనెన్స్ వరంగల్ బ్రాంచ్ అద్భుత విజయాలను నమోదు చేసి, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా నంబర్‌వన్ జేఈఈ కోచింగ్ కళాశాలగా నిలిచిందని విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి అన్నారు. ఈసారి 11 మంది విద్యార్థులు 99పైగా పర్సంటేజీ సాధించగా, 64 మంది విద్యార్థులు 95పైగా, 161 మంది విద్యార్థులు 90 పైన పర్సంటేజీ సాధించారన్నారు. జాతీయ స్థాయిలో ఏఐఆర్ 13, 236, 306, 949, 988 ర్యాంకులను కైవశం చేసుకున్నారని తెలిపారు. ఇకపై కూడా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో వరంగల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో విజయం సాధించాలని, ప్రపంచ స్థాయి విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స